# జానపదసాహిత్యంలో పురాణాలు

చిగిచర్ల కృష్ణారెడ్డి

సాహిత్యంలో శిష్టసాహిత్యమని, జానపదసాహిత్యమని, రెండువిభాగాలున్నాయి. శిష్టసాహిత్యం వ్యక్తి సృష్టి. జానపద సాహిత్యం సమూహ సృష్టి. పురాణం అన్న సాహిత్య ప్రక్రియ సంస్కృతభాషలో శిష్ట సాహిత్య స్థాయిని పొందింది. దీన్నే "మైథాలజీ" అంటారు. చరిత్రకు పూర్వ దశల్లో మానవసంస్కృతి, సామాజిక విలువలు, మానవుల అవగాహన వీటిని ప్రతిబింబించే రచనలు ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ మౌఖిక సాహిత్యంగా ప్రజల నోళ్లలో, పెద్దమ్మలు చెప్పే కథల్లో, పాడిచే చాటువల్లో పాడుకొనే పాటల్లో మిగిలి వుంటాయి. పుక్కిటి పురాణమని, కట్టుకథలని చాలా తేలిగ్గా తీసికొనే ఈ వాఙ్మయంలో మానవుడు సృష్ట్యాది నుంచీ ఎలా ఎలా పరిణమిస్తూ వచ్చాడో ప్రకృతిని ఎలా విశ్లేషించాడో తమ ఉనికిని ఎలా గుర్తించాడో అన్న విషయాలే ఏ భాషలోనైనా పురాణ ఇతిహాసాలపేరిట కర్మకాండలతో ముడిపడి ప్రజల అలవాట్లలో మిళితమై జీవితంలో భాగమై వారి కార్యకలాపాలకు తాత్త్విక ప్రేరణగా మిగిలివుంటాయి.

పురాణంలో వస్తువుకి సంబంధించినంత వరకు శిష్టజానపద వాఙ్మయాలలో భేదం తక్కువే కానీ, రూపంలో మాత్రం జానపద పురాణాలు కొన్ని ప్రత్యేకతల్ని కల్గి వున్నాయి. ఒక్కోసారి దీని ప్రభావం వస్తుస్వరూప అవగాహన మీద కూడా పడుతుంది. ఎప్పటికప్పుడు మానవుడు తన జీవితంలో వస్తున్న పరిణామాన్ని తనచుట్టూవున్న పరిసరాల్ని, వ్యక్తుల్ని, స్వభావాల్నిపురాణ కథలోకి ఎక్కించటంవలనే జానపద పురాణంలో శిష్టుల పురాణంలో లేని ఒక నిత్య పరిచయలక్షణం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది.

సంస్కృతంలో 18 పురాణాలున్నాయి. (అష్టాదశ పురాణాలు) వాటిలో భారత భాగవతాలు జానపదులకు చాలా పరిచయంలో వున్న వస్తువులు. ఇతిహాసాల్లో రామాయణం ఎక్కువ ప్రీతిపాత్రమైంది. రామాయణం కథాగమన రీతిలో కావ్యమే అయినా పురాణ ప్రసిద్ధివున్న ఇతివృత్తమైంది. జానపదులు ఎక్కువగా పాడుకొనే పాటలు రామాయణ భారత భాగవతాల్లోనివి.

కానీ నిమ్న జాతుల్లో దేశీయతా ముద్ర వున్న ఇతర పురాణాలు అనేకం వున్నాయి. ఉదాహరణకు ఆసాది వాళ్ళలో ప్రచారంలో వున్న మాతాపురాణం శాక్తేయ మతానికి సంబంధించింది. అతిప్రాచీనమైన మాతృస్వామ్య సమాజాన్ని ప్రతిబింబింపచేసే "శక్తి" పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించిన కథలు శిష్టులకంటె భిన్నంగా జానపదుల్లో మాత్రమే వుంది. ఆదిపరాశక్తి ఒక గుడ్డు పెట్టిందని, ఆ గుడ్డులోంచి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పుట్టారని చెప్పే "ముగ్గురమ్మల మూలపుట్టమ్మ" కథ జానపదులకు మాత్రమే తెలుసు. మాతాపురాణం పేరిట తెలంగాణా ప్రాంతంలో బావనీలు(బైండ్లు) పాడేపాట, శాక్తేయం వీరశైవం పడ్డ మత పరమైన సంఘర్షణను సూచించేది. ఆసాది వాండ్లు రాయలసీమలో 'పెద్దమ్మకథ' అనే పేరిట దీన్ని పాడతారు.

ఆదిలాబాద్ ప్రాంతంలో నివసిస్తున్న 'గోండు' జాతిప్రజల్లో ప్రచారంలోవున్న 'కాలికంకలీ' కథకూడా ఈ కోవకు చెందిందే.

'మేరుపర్వతం మీద దేవతలంతా సమావేశమైనారట. 'పాపినరంజన్‌వెన్' అన్న పురుషదేవత నేనే సర్వాధికుణ్ణి అన్నాడట. 'నిరానింజన్‌వెన్' అన్న స్త్రీదేవత నేనే నన్నది. వారి దృష్టులు కలిస్తే ఆమె గర్భవతి అయిందట. ఆమెకొక కూతురు జన్మించిందట 9 ఘడియల్లో. దానిపేరు 'కాలికంకలి.' అది నీరు తేవటానిక ఏటికెల్లి 'ఋషిశరత్' అన్నవాడు దంతధావనం చేసుకొని పారవేసిన 'ఆకు' నీటిలో కొట్టుకొనివచ్చిన దాన్ని నమలి తిన్నందువల్ల గర్భం ధరించింది. ఆమె 12 కళ్ళాల గోండుదేవతల్ని, 33 కళ్ళాల తెలుగుదేవతల్ని, 32 కళ్ళాల మరాట దేవతల్ని కన్నదట. ఈ గోండు జాతి వంశపురుషుడు 'పెహందిలింగాల్'. మొహమి అన్నపురాతన గరుడపక్షి గ్రుడ్డు పెడితే అందులోనుండి వీడూ, పాండురాజు పుట్టారట.

పెహందిలింగాల్ అనే గోండుల మూల పురుషుడొకడున్నాడని 33 కళ్ళాల తెలుగు దేవతల్ని 'కలాకంకలి' కన్నదని చెప్పే ఈ కథ, గోండులకు తెలుగులకువున్న చారిత్రక సంబంధానికి గురించి చరిత్ర చెప్పిన ఎన్నో విషయాల్ని అందిస్తోంది. ఇలాగే జానపదుల్లో కుమారస్వామికథ చాలా ప్రచారంలో వుంది.

రత్నభల్లాణుడన్న రాజుకొడుకు వీరరుద్రుడు యోనిజుడై జన్మించటాని కిష్టం లేక గుమ్మడి పండులో నుండి పుట్టినట్లుంది. ఈ గుమ్మడిపండు ఒక దృష్ట్యా ప్రతీక. మరొక దృష్ట్యా చిహ్నం. గుమ్మడితోట తెల్లుతోట ఒకటే. ఇది కుమారస్వామికథలో వుంది. తెల్లుతోటకు సంస్కృత నామం కాశవనం. కాశమూ ఆకాశమూ ఒక్కటే. అనంతత్వానికి అనంత తత్త్వానికి అది ప్రతీక. ఇందుకే ఉపనిషత్తులో ఆకాశం నుండి జీవసృష్టి జరిగిందని చెప్పబడగా బ్రహ్మసూత్రకారుడు ఆకాశమంటే "పరబ్రహ్మ పదార్థ" మని నిర్ధరించాడు. సువర్ణకాశవనానికి బంగారు రంగులోవున్న గుమ్మడిపండ్ల తోట తన అనుభవంలో వున్నదాన్ని తెలుగు జానపదకవి తీసుకొన్నాడు. అలాగే గుమ్మడి

(39 వ పేజీలో)